# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శుక్రవారం | 05 ఏప్రిల్, 2024 | పేజీలు : 05


## మంచిర్యాల జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు



**ప్రజాపక్షం/మంచిర్యాల :** మంచిర్యాల జిల్లాలో గురువారం గరిష్టంగా 42. 5 డిగ్రీలు, కనిష్టంగా 41. 2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి. కాసిపేట మండలం కొండాపూర్ లో 42. 5 డిగ్రీలు, భీమిని మండలంలో 42. 5, భీమారం మండలంలో 42. 4 కాసిపేట మండలం దేవులవాడలో 42. 4, జన్నారం మండలం కవ్వాల్ అభయారణ్యంలో 42. 2, జన్నారంలో 41. 9, నెన్నెలలో 41. 6, కన్నెపల్లి మండలం జన్కాపూర్ లో 41. 5, పాత మంచిర్యాలలో 41. 2, కన్నెపల్లిలో 41. 2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# జోరుగా ఐపిఎల్ బెట్టింగ్



### ఆన్‌లైన్ ద్వారా ఆర్థిక లావాదేవీలు
### అప్పుల ఊబిలో కూరుకుపోతున్న బాధితులు

**ప్రజాపక్షం/పెంచికల్ పేట్ :** ఐపిఎల్ క్రికెట్ బెట్టింగ్‌లు కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. బంతికి బంతికి, షాట్ షాట్‌కి బెట్టింగ్ హవా సాగుతోంది. వికెట్ పడితే ఇంత, ఎల్‌బి అయితే ఇంత, ఫోర్ కొట్టిన, బంతిని నేరుగా గ్రౌండ్ అవతలికి పంపిన డబ్బులే డబ్బులు.. ఈ బెట్టింగ్ల పుణ్యమా అని వ్యాపారులతో పాటు యువత, ఉద్యోగస్తులు అప్పులపాలు అవుతున్నారు. జిల్లాలో జోరుగా బెట్టింగులు సాగుతున్నట్లు తెలుస్తుంది. జిల్లాలోని పెంచికల్‌పేట్, కాగజ్ నగర్, దహేగాం, బెజ్జూర్, కౌటాల, చింతలమానేపల్లి, సిర్పూర్ మండలాలతో పాటు తదితర ప్రాంతాలలో బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారని సమాచారం. మండలాలతో పాటు పట్టణ, పల్లె ప్రాంతాలలో పలువురు ఉద్యోగులు, వ్యాపారులు, యువకులు బెట్టింగ్ల పేరిట భారీ మొత్తంలో నష్టపోయినట్లు తెలుస్తుంది. క్రికెట్ అంటే నేటి యువతకు ఎంతో మక్కువ ఉంటుంది. సమయం దొరికితే చాలు బ్యాట్ బాల్ పట్టుకొని మైదానాల వెంట పరుగులు తీస్తుంటారు. ఇక దేశవాళి క్రికెట్ పోటీలు జరిగే రోజులు వారికి సందడే సందడి. గతంలో టీవీలకు అతుక్కుని కూర్చున్న యువత ఇప్పుడు సెల్ ఫోన్లు పట్టుకుని ప్రతి బంతిని నిశితంగా చూస్తున్నారు. గత కొంతకాలంగా పల్లెల్లో బెట్టింగ్ల వైపు మొగ్గు చూపుతూ తమ అభిమాన జట్టు విజయం సాధిస్తుందని వేలాది రూపాయలు బెట్టింగ్లు కాస్తున్నారు. ప్రస్తుతం ఐపిఎల్ సీజన్ సాగుతుండడంతో జిల్లాలో బెట్టింగ్ల రాయులు రంగంలో దిగి క్రికెట్ బ్యాట్ మోజు ఉన్న వారిని టార్గెట్ చేసుకొని ఈ జూదంలోకి దింపుతున్నారు. పలు ప్రాంతాల్లో అడ్డాలు తయారు చేసుకుని అక్కడ నుండి ఈ రాకెట్‌ను కొనసాగిస్తున్నారు. దీంతో ప్రతినిత్యం లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయి.

**జిల్లాలో దొరికిన బెట్టింగ్ రాయుల్లు...**

జిల్లాలో ఇటీవల నిషేధిత అప్లికేషన్స్ ద్వారా అన్ లైన్ ఐపిఎల్ క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న వారిని టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. బుధవారం కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పి సురేష్ కుమార్ ఆదేశాలమేరకు జిల్లాలో ఐపియల్ క్రికెట్ బెట్టింగ్ భారీగా జరుగుతుందని టాస్క్ ఫోర్స్ పోలీసులకు అందిన పక్క సమాచారం మేరకు కాగజ్ నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జీడిచేను గ్రామ శివారులో, పెంచికల్ పేట్ మండలంలో ప్రభుత్వ నిషేధిత అప్లికేషన్స్ ద్వారా, ఐపియల్ క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ఐదుగురిని పట్టుకుని కేసులు నమోదు చేసి వారి వద్ద నుండి రూ. 30,000/ నగదు, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ సిఐ రాణా ప్రతాప్ తెలిపారు. వివరాల్లోకి వెళ్ళితే పెంచికల్‌పేట్ మండలంలోని ఎలకపల్లి గ్రామానికి చెందిన పోలోజు నరేష్ అనే వ్యక్తి ని పట్టుకొని విచారించగా అతని వద్ద ఉన్న వ్యక్తుల ద్వారా ప్రభుత్వ నిషేదిత అప్లికేషన్స్ ద్వారా ఐపిఎల్ క్రికెట్ బెట్టింగ్‌ని వాట్సాప్ , టెలిగ్రాం తోపాటు వివిధ సోషల్ నెట్వర్కింగ్ సైట్లలో పోస్ట్ చేస్తున్నాడని తేలింది. అతనిని పట్టుకొని విచారించగా అతని వద్ద ఉన్న వారిలో మేడిగొండ లక్ష్మ ణ్ జీడిచేను గ్రామం, భూజడి తిరుపతి పెంచికల్ పేట్, బొడ్డు రాజశేకర్ జీడిచెను, బుసా సుభాష్ జీడీచెను వారు ఉన్నారని తెలిసింది.

**బెట్టింగ్‌లకు పాల్పడితే చట్టరీత్య చర్యలు తప్పవు.. టాస్‌ఫోర్స్ సిఐ రాణా ప్రతాప్...** పేకాట, ఆన్ లైన్ మట్కా, జూదం, ఐపిఎల్ క్రికెట్ బెట్టింగ్ లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని టాస్‌ఫోర్స్ సిఐ రాణా ప్రతాప్ హెచ్చరించారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా లోని వివిధ గ్రామాల్లో, మండలాల్లో పేకాట, ఐపిఎల్ క్రికెట్ బెట్టింగ్, ఆన్ లైన్ జూదం, మట్కా, లాంటివి ఆడి జీవితాలు పాడుచేసుకోవద్దన్నారు. ఐపిఎల్ బెట్టింగ్‌లు చేస్తూ, ఆన్ లైన్ మాట్కా, జూదం ఆన్ లైన్ గేమ్ లు ఆడుతున్న వారి పై చర్యలు తీసుకుంటామని, ఆడినవారు దొరికితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ముఖ్యంగా యువత ఇలాంటి ఆన్ లైన్ జూదం, క్రికెట్ బెట్టింగ్ లు ఆడుతూ అత్యాశకు పోయి జీవితాలు పాడుచేసుకోవద్దని, కేసులు నమోదయ్యితే ఉద్యోగ అవకాశాలు, ఇతర అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. పేకాట, ఆన్ లైన్ మట్కా, జూదం, ఐపిఎల్ క్రికెట్ బెట్టింగ్ లకు పాల్పడే వారి సమాచారం ఉంటే పోలీసులకు అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసి మధు, రమేష్, పాల్గొన్నారు.



## పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకోవాలి

**ప్రజాపక్షం/కరీంనగర్:** ఎన్నికల విధులతో పాటు అత్యవసర సేవల పరిధిలోకి వచ్చే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అత్యవసర సేవల పరిధిలోకి వచ్చే వివిధ శాఖల నోడల్ అధికారులతో పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగంపై అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈసందర్భంగా శాఖల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫామ్ 12డి సమర్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఆయా శాఖల నోడల్ అధికారులు వీటిని అందించాలని పేర్కొన్నారు. అర్హులైన ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌వో పవన్ కుమార్, శ్రీనివాస్,నవీన్ కుమార్, మహేశ్వర్, పాల్గొన్నారు.



### విద్యార్థులకు మెరుగైన
## చికిత్సలు అందించాలి

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:** ఫుడ్ పాయిజన్ తో అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వైద్యాధికారలను ఆదేశించారు.ఫుడ్ పాయిజన్ తో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నర్సాపూర్(జి) కేజీబీవీ విద్యార్థులను గురువారం ఆయన పరిశీలించి వైద్యులకు,అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫుడ్ పాయిజన్ తో అస్వస్థతకు గురైన 26 మంది విద్యార్థులకు అత్యవసర వైద్య చికిత్సలు అందించడం జరుగుతుందని తెలిపారు.విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో చర్చించడం జరిగిందని, తల్లిదండ్రులెవరు ఆందోళన చెందవద్దని అన్నారు. ఘటనకు సంబంధించి పూర్తి విచారణ జరిపిస్తామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి రవీందర్ రెడ్డి, వైద్యులు, పాల్గొన్నారు.



# సైబర్ బాధితులకు మెరుగైన సేవలు



ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి: సైబర్ నేరాలను త్వరితగతిన పరిష్కరించేదుకు పోలీస్ శాఖ పక్షాన ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జగిత్యాల ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సైబర్ వారియర్స్‌కు ఫోన్లు, సిమ్ కార్డులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్‌లో సైబర్ నేరాలపై ప్రత్యేక శిక్షణ పొందిన సైబర్ వారియర్లను నియమించడం ద్వారా సైబర్ నేరాలు కట్టడికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. జగిత్యాల జిల్లాలో 18 పోలీస్ స్టేషన్‌లో 18 మంది సైబర్ వారియర్స్‌ను నియమించడం జరిగిందని అన్నారు. ఈ సైబర్ నేరాల బాధితులకు సైబర్ నేరాల గురైన వెంటనే 1930 లేదా ఎన్ సి ఆర్ పి పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. బాధితులు ఫిర్యాదులను నమోదు చేయడం వలన నిందితులను గుర్తించడం సులువు అవుతుందన్నారు. సైబర్ మోసాలకు గురైన బాధితులు ఏమాత్రం ఆందోళన చెందవద్దని ఘటన చోటు చేసుకున్న తర్వాత వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. వారికి తగిన సేవలు అందించేందుకు ఇప్పుడు ప్రతి పోలీస్ స్టేషన్‌లో సైబర్ వారియర్స్ సిబ్బంది అందుబాటులో ఉంచటం జరిగిందని వారికి ప్రత్యేక ఫోన్ నెంబర్ ఉంటుందన్నారు. రద్దీ వల్ల టోల్ ఫ్రీ నెంబర్ 1930ను సంప్రదించడంలో కాస్త జాప్యం జరగడంతో దీన్ని నివారించేందుకు రాష్ట్ర పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటుందని ప్రజలు ఈ యొక్క అవకావశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ రంగా రెడ్డి, సైబర్ క్రైమ్ సిబ్బందిపాల్గొన్నారు.

## ప్రజల ఆశీస్సులతో గెలుస్తా



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం ఓదెల మండలంలోని కనగర్తి గ్రామంలో భూలక్ష్మి మహాలక్ష్మి బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో , సుఖ సంతోషాలతో జీవించాలని, కాక ఆశీస్సులతో పెద్దపల్లి గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని, స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు నాయకత్వంలో నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ కాంగ్రెస్ పార్టీ కే వస్తుందని, తన గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉనుకొండ శ్రీధర్ ,గుండేటి ఐలయ్య యాదవ్ , నాయకులు కోట సత్యనారాయణ రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మైనారిటీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్: తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ, హైదరాబాద్ ద్వారా యు.పి.ఎస్.సి. సి.ఎస్.ఎ.టి. 2025 పరీక్ష కోసం 2024/25 విద్యాసంవత్సరంలో 100 మంది మైనారిటీస్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్‌ను అందించనున్నట్లు, అర్హులైన మైనార్టీ అభ్యర్థులు ఏప్రిల్ 12 లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మొహమ్మద్ మేరాజ్ మహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన ఉంటుందని, యుపిఎస్సి (సిఎస్ఎటి 2025) యొక్క సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ లో ప్రవేశం కోసం తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోని సాధారణ / ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీస్ అభ్యర్థులు ఆన్‌లైన్ www.tmreistelangana.cgg.gov.in అనే వెబ్ సైట్ ద్వారా ఏప్రిల్ 12 లోగా దరఖాస్తులు చేయాలని, స్క్రీనింగ్ టెస్ట్ ఏప్రిల్ 28న ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కేంద్రంలోని మైనారిటీ గురుకుల బాలికల పాఠశాల, రంగంపల్లిలో నిర్వహించబడు తుందని, అర్హులైన ఆసక్తి కలిగిన మైనారిటీ విద్యార్థులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 04023236112 లో పని రోజుల్లో సంప్రదించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మొహమ్మద్ మేరాజ్ మహ్మద్ ఆ ప్రకటనలో తెలిపారు.

## గుండారం రిజర్వాయర్ నుండి సాగునీరు విడుదల



ప్రజాపక్షం/రామగిరి: గుండారం రిజర్వాయర్ నుండి మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు డి83 కెనాల్ ద్వారా స్థానిక నాయకులు గేట్లు ఎత్తి గురువారం సాగు నీటిని దిగువకు విడుదల చేశారు. ఎండలతీవ్రత పెరిగి పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆయకట్టు పరిధిలోని చివరి గుంట వరకు పంట పొలాలన్నిటిని కాపాడాలని శ్రీధర్ బాబు సంబంధిత ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో గేట్లు తెరిచి నీళ్ల ఇవ్వడం జరిగిందని వారు పేర్కొన్నారు. సాగు నీరు అందక పొలాలు ఎండిపోతాయని రైతులెవరూ అధైర్యపడవద్దని., సాగు నీటి విషయంలో శ్రీధర్ బాబు ఎప్పటికప్పుడు అధికారులతో చర్చిస్తున్నారని., అవసరమైనప్పుడల్లా నీటి విడుదల కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రామగిరి ఎంపిపి ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్, మంథని మున్సిపల్ చైర్మన్ పెంద్రు రమ,వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, మంథని నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్ బర్ల శ్రీనివాస్, మాజీ జెడ్పీటిసి గంట వెంకటరమణరెడ్డి, మాజీ సర్పంచ్ బుద్దార్తి బుచ్చన్న, రామగిరి మండల సోషల్ మీడియా ఇన్చార్జ్ సిద్ధం మురళీకృష్ణ, కలవచర్ల ఉపసర్పంచ్ కనకయ్య, మంథని మున్సిపల్ కౌన్సిలర్ రవి, వినోద్, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

## రాజమల్లు జ్ఞాపకార్థంగా వాటర్ ఫ్రిడ్జ్ వితరణ





ప్రజాపక్షం/సుల్తానాబాద్: పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీసీ ముద్దుబిడ్డ, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ప్రజల మనిషి స్వర్గీయ బిరుదు రాజమల్లు ఇటీవల మృతి చెందగా రెండో నెల కర్మ సందర్భాన్ని పురస్కరించుకొని వారి జ్ఞాపకార్థంగా బిరుదు కుటుంబ సభ్యులు అందరూ కలిసి పట్టణంలోని స్థానిక ముప్పై పడగల ప్రభుత్వ ఆసుపత్రికి గురువారం వాటర్ ఫ్రిడ్జ్ ను వితరణగా అందించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రికి వచ్చే పేషెంట్లు సౌకర్యార్థం కొరకు 80 లీటర్ల వాటర్ ఫ్రిడ్జ్ ను ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలో ఉన్న రోగులకు బ్రెడ్లు, సేపులు ,అరటి పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా బిరుదు రాజమల్లు తనయుడు సుల్తానాబాద్ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బిరుదు సమతా కృష్ణ మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం ప్రభుత్వ ఆసుపత్రికి వాటర్ ఫ్రిడ్జ్ ను అందజేయడం, ఎండాకాలం దృశ్య ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు, అడ్మిట్ పేషెంట్లకు చల్లని నీరు అందించి వారి దాహార్తిని తీర్చడం సంతోషంగా ఉందని అన్నారు, ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు బిరుదు సతీమణి బిరుదు సుశీల, కూతుళ్లు అల్లులు ఖమ్మం అడిషనల్ ఎస్పీ రాయిళ్ళ సాయిబాబా స్వరూప, ఇంటలిజెన్స్ ఏసిపి శేరి గిరి ప్రసాద్ రత్న కుమారి, బిరుదు శ్రీనివాస్ శ్రీనిధి ,అనిల్ దీప్తి ,బిరుదు సంతోష్, శ్రీవాణి విద్యా సంస్థల కరస్పాండెంట్ రేకులపల్లి సుష్మ , కుటుంబ సభ్యులు బిరుదు అభిమానులు పాల్గొన్నారు.

## బిజెపి మండల పార్టీ అధ్యక్షుల నియామకం



ప్రజాపక్షం/మంథని: మంథని నియోజకవర్గంలోని ఆయా మండలాల మండల పార్టీ అధ్యక్షులను నియమిస్తూ భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు చందుపట్ల సునీల్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మంథని, ముత్తారం, కమాన్‌పూర్, రామగిరి, మహాముత్తారం, కాటారం, మహాముత్తారం, మహాదేవ్‌పూర్, పలిమెల, మల్హర్ మండలాల పార్టీ అధ్యక్షులను నియమించారు. మంథని టౌన్ అధ్యక్షుడిగా సబ్బని సంతోష్, మండల అధ్యక్షుడిగా వీరబోయిన రాజేందర్, కమాన్‌పూర్ మండల అధ్యక్షులుగా జంగపల్లి అజయ్, రామగిరి మండల అధ్యక్షుడిగా ముల్కూరి శ్రీనివాస్, ముత్తారం మండల అధ్యక్షుడిగా బిరుదు గట్టయ్య, మల్హర్ మండల అధ్యక్షులుగా ముడతనపెల్లి ప్రభాకర్, కాటారం మండల అధ్యక్షుడిగా బండం మల్లారెడ్డి, మహాముత్తారం మండల అధ్యక్షుడిగా మేడిపల్లి పూర్ణ చందర్, మహాదేవ్‌పూర్ మండల అధ్యక్షుడిగా ఆకుల శ్రీధర్, పలిమెల మండల అధ్యక్షుడిగా నిరంజన్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా తమపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డికి ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఆయన జయంతి సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలో ఉదయం 10 గంటలకు జయంతి వేడుకలు జరుగుతాయని వెల్లడించారు. దీనికిగాను తగిన ఏర్పాట్లను చేయాలని ఆయా శాఖాధిపతులను ఆదేశించారు.

## చలివేంద్రం ప్రారంభం



ప్రజా పక్షం/పెద్దపల్లి టౌన్ : గురువారం రోజున స్థానిక పెద్దపెల్లి ఎమ్మెల్యే చింత కుంట విజయ రమణారావు చేతుల మీదుగా స్థానిక అయ్యప్ప టెంపుల్ చౌరస్తా లో సయ్యద్ చలివేంద్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ రద్దీగా ఉండే అయ్యప్ప కూడలిలో ప్రజల దాహం తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఈ సందర్భంగా చలివేంద్రం ఏర్పాటు చేసిన యువకులను అభినందించారు.ఈ కార్యక్రమం లో స్థానిక కౌన్సిలర్, న్యాయవాది ఉప్పురాజు, సయ్యద్ ఖలీద్, సయ్యద్ మస్రత్, ఎరుకల రమేష్,ఆసిఫ్, నాగుల ఓదెలు, బొడ్డుపల్లి అశోక్, తూముల మనోహర్, ఉప్పు రాంచంద్రం పాల్గొన్నారు.

## వంశీకృష్ణను భారీ మెజారిటీతో గెలిపిస్తాం



ప్రజాపక్షం/ రామగిరి: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి ఎంపి అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని రామగిరి ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్యగౌడ్ పేర్కొన్నారు. గురువారం రామగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో ఆయన అండదండలతో, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సహాయ సహకారాలతో వంశీకృష్ణ గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. గతంలో దివంగతనేత, పితృసమానులు, ఉమ్మడి రాష్ట్ర శాసన సభాపతి శ్రీపాదరావు ఆధ్వర్యంలో కాకా వెంకటస్వామి గెలిపించుకున్నామని, శ్రీపాదరావుహయాంలో వెంకటస్వా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో అనేక సేవలు చేశారని గుర్తు చేశారు. మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల ప్రకారం ఆయన నేతృత్వంలో పెద్దపెల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణని భారీ మెజార్టీతో గెలిపించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు.

## సుల్తానాబాద్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులుగా నాగరాజు



ప్రజాపక్షం/సుల్తానాబాద్: సుల్తానాబాద్ మున్సిపాలిటీ పట్టణ బిజెపి అధ్యక్షులుగా కూకట్ల నాగరాజు ని బిజెపి పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి నియిమించడం జరిగింది. ఈ సందర్భముగా కూకట్ల నాగరాజు మాట్లాడుతూ బిజెపి బూత్ స్థాయి నుండి కష్టపడి బిజెపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను అని అన్నారు. నియామకానికి సహకరించి, ప్రోత్సహించి అధ్యక్షులుగా నియమించిన బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ కి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శీలారావు పర్వతాలు కి, పెద్దపల్లి జిల్లా బిజెపి అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి కి, పెద్దపల్లి అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్ కి, బిజెపి రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు, కార్యకర్తలకు, నా తోటి సుల్తానాబాద్ బిజెపి పట్టణ కమిటీకి, బూత్, శక్తికేంద్రం సభ్యులకు మిత్రులు అందరికీ కూకట్ల నాగరాజ్ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ఉచిత కంటి శిబిరానికి స్పందన



ప్రజాపక్షం/సుల్తానాబాద్: ఏబీవీపీ ఫోరం స్టూడెంట్స్ ఫర్ సేవ పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ నగర శాఖ ఆధ్వర్యంలో స్థానిక శ్రీవాణి డిగ్రీ పీజీ కళాశాలలో ఉచిత కంటి పరీక్ష శిబిరం గురువారం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా స్టూడెంట్స్ ఫర్ సేవ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ సందనవేని ఓమేష్ మాట్లాడుతూ మన రోజు వారివిలువైన సమయంలో సెల్ ఫోన్స్ పై పుస్తకాలపై కంటి చూపు ఉండడంవల్ల మనకు తెలియకుండానే కంటి వ్యాధులకు గురువుతున్నాం అన్నారు.అయితే స్టూడెంట్స్ ఫర్ సేవ విసూత్నమైనటువంటి ఆలోచనతోటి కంటి పరీక్ష శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది , దానిలో భాగంగా శ్రీవాణి డిగ్రీ పీజీ కళాశాలలో సుమారు 100 మంది విద్యార్థులకు కంటి పరీక్ష నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలోనేత్రవైద్య సహాయకులు భూతగద్ద చందు విష్ణు భక్తుల రిషి , రసూరి ప్రవీణ్, బండి రాజశేఖర్ ,సాయి తేజ, కళాశాల సిబ్బంది ,విద్యార్థులు పాల్గొన్నారు.

# పంట నష్టపోయిన రైతులను పరామర్శించిన బిజెపి నాయకులు



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలోని చింతకుంట, మల్కాపూర్ గ్రామాల్లో పంట నష్టపోయిన రైతులను బిజెపి నాయకులు పరామర్శించారు. కొత్తపెల్లి మండల అధ్యక్షుడు కడార్ల రతన్ కుమార్ ఆద్వర్యంలో మండలంలోని చింతకుంట, మల్లాపూర్ గ్రామానికి ఎస్సారెస్పీ ఆధారిత పంట పొలాలను సందర్శించి రైతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంధర్బంగా మండల అధ్యక్షులు కడార్ల రతన్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 3 నెలలు పూర్తయినా ఇప్పటి వరకు ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీటిని విడుదల చేయకపోవడంతో కాలువతో ఆధారపడే రైతుల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చింతకుంట గ్రామానికి చెందిన కౌలు రైతులు గద్దల బాబురాజన్న, జేరిపోతుల సంజీవ్, పైడిపాల ఎల్లయ్య, జేరిపోతుల కార్తీక్‌లకు చెందిన దాదాపు 10 ఎకరాల పొలానికి సమయానికి సాగు నీరు అందక వరి మొత్తం ఎండిపోయిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మండల ప్రధాన కార్యదర్శి వేముల అనిల్ కుమార్, ఓబిసి మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టవేని రేణు, యువ మోర్చా మండల అధ్యక్షుడు యువ ప్రశాంత్, దాసరి రవి, సదానందం, సురేస విజయ్, శ్రావణ్, శ్రీనివాస్, జీవన్, రవి తదితరులున్నారు.

## సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు



**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** అపర భద్రాద్రి ఇల్లందకుంటలో ఈ నెల 17న జరిగే శ్రీసీతారామ చంద్రస్వామిల కళ్యాణానికి భారీగా తరలివచ్చే భక్తుల కోసం తగిన ఏర్పాట్లను హుజురాబాద్ ఆర్డీవో రమేష్ బాబు పరిశీలించారు. భక్తుల కోసం త్రాగునీటి, విధ్యుత్, చలువ పందిళ్లతో పాటు సకల సౌకర్యాలు సమకూర్చాలని పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాణి సిఐ ఆర్ఐ నాగరాజు, కిషోర్ ఎస్సై రాజ్‌కుమార్, ఆలయ ఈవో కందుల సుధాకర్‌లతో పాటు ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## కబ్రస్థాన్‌లో పేరుకుపోయిన చెత్త తొలగింపు

**ప్రజాపక్షం/జమ్మికుంట:** ముస్లింల పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కబ్రస్థాన్‌లో ప్రార్ధనలు చేసుకునేందుకు వీలుగా అక్కడ పేరుకుపోయిన చెట్లు, మొక్కలు, చెత్తను తొలగించారు. మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు ఆద్వర్యంలో ఈ నెల 11న రంజాన్ పండుగ పురస్కరించుకుని కబ్రస్థాన్‌లో మున్సిపల్ సిబ్బందిచే పనులు చేయించారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలుండి అందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో పండుగ జరుపుకోవాలన్నారు.

## ప్రమాదవశాత్తు రైలు నుంచి కిందపడి యువకుని మృతి



**ప్రజాపక్షం/జమ్మికుంట:** ప్రమాదవశాత్తు రైలు కిందపడి మృతి చెందిన సంఘటన గురువారం జమ్మికుంటలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మృతుడు రాజ్ కుమార్ (12), కోటప్ గ్రామం, ఛత్ర జిల్లా, ఝార్ఖండ్ రాష్ట్రం కాగా హైదరాబాద్‌లో కూలీ చేస్తున్నాడు. తన స్వగ్రామానికి నిన్న రాత్రి సికింద్రాబాద్‌లో పాట్నా స్పెషల్ రైలు ఎక్కి రాంచికి ప్రయాణం చేస్తుండగా ఉప్పల్‌జమ్మికుంట రైల్వే స్టేషన్‌ల మద్య బహుషా ప్రమాదవశాత్తు ట్రైన్ నుంచి కింద పడడం గానీ ఇతర కారణం వల్ల చనిపోయి ఉండవచ్చునని రామగుండం ప్రభుత్వ రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ తెలుపుతూ కేసును దర్యాప్తు చేస్తున్నారు. మృతుని తల్లిదండ్రులు వచ్చేంత వరకు శవాన్ని జమ్మికుంట ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు.

## రాజ్యాంగ యాత్ర కరపత్రం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/చిగురుమామిడి:** రాజ్యాంగ రక్షణ యాత్ర రక్షణ యాత్ర రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆద్వర్యంలో చిగురుమామిడి మండల కేంద్రం లోని డా.బిఆర్‌ఎ అంబేద్కర్ సెంటర్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య హాజరయ్యారు. ఈ సంధర్బంగా రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. మనువాదులు రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తే మట్టిలో కలుపుతామన్నారు. అహంకారంతో కేంద్రంలో 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామన్న బిజెపికి ఓటు ద్వారా వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. కులాలకు, మతాలకతీతంగా ప్రతి పౌరుడు రాజ్యాంగ రక్షణకై సైనికుడిలా కదలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాతీయ మాలమహానాడు రాష్ట్ర సాంస్కృతి చైర్మన్ ఎలుక దేవయ్య, కరీంనగర్ పార్లమెంటు ఇంచార్జి బొలుమల్ల సదానందం, మండల అధ్యక్షుడు ర్యాకం కరుణాకర్ జిల్లా నాయకులు బొలుమల్ల రాజమౌళి, మండల నాయకులు మాసం సదికుమార్ లింగం, కుమార్, గంభీరావుపేట సతీష్ తదితరులున్నారు.

## వెంటనే ఐకెపి సెంటర్ల ద్వారా కొనుగోలు ప్రారంభించాలి



**ప్రజాపక్షం/జమ్మికుంట:** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఐకెపి సెంటర్ల ద్వారా కొనుగోళ్లు ప్రారంభించాలని బిజెపి నాయకులు అన్నారు. ఈ సంధర్బంగా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. బిజెపి జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్ మాట్లాడుతూ రైతులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని, ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. కొన్ని చోట్ల సరైన సమయంలో సాగునీరు వదలకపోవడంతో పంటలు ఎండిపోయాయని, ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంట నష్టం జరిగిందన్నారు. ఇప్పటి వరకు పరిహారం అందించలేదన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల చొప్పున నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జీడి మల్లేష్, పల్లపు రవి, కైలాష్ కోటి గణేష్, మేక సుధాకర్ రెడ్డి, కొమ్ము అశోక్, మోతె స్వామి, ఇటుకల స్వరూప, తుడి రవిచంద్ర, రెడ్డి ఠాగూర్ రాకేష బూరుగుపల్లి రామ్, రాచపల్లి ప్రశాంత్, ఎర్ర వెంకటేష్, ఇల్లందుల శ్రీనివాస్, వేముల జగన్, మైస భాగ్య, కనమల లక్ష్మి , కేశ స్వరూప, శివర్తి అఖిల్ తదితరులున్నారు.

## సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై శిక్షణ



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆద్వర్యంలో వైద్యాధికారులకు, పారామెడికల్ సిబ్బందికి డిఎంహెచ్‌వో కార్యాలయంలో కీటక జనిత వ్యాధులు, నియంత్రణ, నివారణ చర్యలపై ఒకరోజు శిక్షణనిచ్చారు. హైదరాబాద్ నుంచి ఎంటమలజిస్ట్‌లు డిడి వెంకటేష్, ఏడి నాగయ్య, ఎన్.సదయ్యలు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాబోవు వర్షాకాలంలో దోమలు అభివృద్ధి చెందడం ద్వారా డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యా, మెదడువాపు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున దోమలు అభివృద్ధి చెందకుండా, కుట్టకుండా అవసరమగు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. మండల,గ్రామ స్థాయిలలో స్థానిక అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి వివిధ శాఖలు పంచాయతీరాజ్, మున్సిపాలిటీలు, స్థానిక సంస్థల సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించినట్లయితే సమర్ధవంతంగా దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను అరికట్టవచ్చన్నారు. డిస్ట్రిక్ మలేరియా అధికారి డా.రాజగోపాల్ నిర్వహించారని, జిల్లా వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.సుజాత తెలిపారు.

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలోని శ్రీ పెద్దమ్మ తల్లి యంత్ర ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో కృపా కటాక్షాలతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. అనంతరం ముదిరాజ్ సంఘ సభ్యులు ఎమ్మెల్యే ను ఘనంగా సన్మానించారు.

## పోలీసుల ఫ్లాగ్ మార్చ్



**ప్రజాపక్షం/హుజురాబాద్:** పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు హుజురాబాద్ మండలంలోని కందుగుల, కునుకులగిద్ద గ్రామాలలో హుజురాబాద్ టౌన్ సిఐ బొల్లం రమేష్ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్(పోలీసు కవాతు) నిర్వహించారు. ఈ సందర్బంగా సిఐ మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ ఉన్నందున వాట్సప్ గ్రూప్‌లలో అభ్యంతరకరమైన మెసెజ్‌లు షేర్ చేయకూడదన్నారు. ఎలాంటి మీటింగ్ కోసం అయినా ముందస్తు పర్మిషన్ తీసుకోవాలని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో హుజురాబాద్ పోలీస్ సిబ్బంది, 40 మంది సిఐఎస్ఎఫ్ ఆఫీసర్లు, జవాన్లు పాల్గొన్నారు.

## పలు వివాహాలకు హాజరైన ఒడితెల ప్రణవ్



**ప్రజాపక్షం/వీణవంక:** వీణవంక మండలంలోని వివిధ గ్రామాలలో జరుగుతున్న వివాహాలకు హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఒడితెల ప్రణవ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాహెబ్ హుస్సేన్, నల్ల కొండాల్ రెడ్డి, ఎక్కటి రఘుపాల్ రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## రూల్స్ సామాన్యులకేనా? పోలీసుకు వర్తించవా?



**ప్రజాపక్షం/వీణవంక:** ట్రాఫిక్ రూల్స ప్రతి ఒక్కరూ పాటించాలని పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వం పదే పదే చెబుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ట్రాఫిక్ రూల్స్ బ్రేక్ చేసిన వారికి భారీగా ఫైన్‌లు సైతం విధిస్తున్నారు. అయితే ఇవన్నీ సామాన్యులకు మాత్రమే వర్తిస్తాయా? పోలీసులకు వర్తించవా? అంటే వర్తించవని చెప్పాలి.. గురువారం వీణవంక బస్టాండ్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ఓ కానిస్టేబుల్ హెల్మెట్ ధరించకుండా బైక్‌పై వెళ్తుండగా ఓ వ్యక్తి పోటో తీశారు. ఈ ఫోటో చూసిన వారంతా పోలీసులకు రూల్స్ పాటించవా? అంటూ ఆయనకు ఫైన్ విధించరా? అని ప్రశ్నిస్తున్నారు.

## మృతురాలి కుటుంబానికి బియ్యం అందజేత



**ప్రజాపక్షం/వీణవంక:** వీణవంక మండలం కోర్కల్ గ్రామంలో అంబాల అంకుసమ్మ మృతి చెందగా విషయం తెలుసుకున్న అతిధి డెవలపర్స్ అధినేత కొమ్మిడి రాకేష్ రెడ్డి తన అనుచరులను పంపించి మృతురాలు కుటుంబాన్ని పరామర్శించి వారికి తన వంతు సహాయంగా 50 కెజిల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాకేష్ రెడ్డి యువసైన్యం వ్యవస్థాపకుడు సతీష్, కర్ణాకర్, శ్రావన అనిల్, గురవారెడ్డి, రాంగోపాల్ రెడ్డి, రాకేష్, బుడిగె బీరయ్య, తిరుపతి, రామస్వామి, అజయ్ కుమార్, మధు గ్రామస్థులు పాల్గొన్నారు.

## నేడు జగ్జీవన్ రామ్ జయంతి...

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** బాబు జగ్జీవన్ రామ్ జన్మదిన వేడుకను అధికారికంగా ఈనెల 5న సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ యాస్మీన్ భాషా ఒక ప్రకటనలో తెలిపారు.

# చికిత్స పొందుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి...

**ఇన్చార్జి మంత్రి సీతక్కతో మాట్లాడిన శ్రీహరి రావు...**

**ప్రజాపక్షం/నర్సాపూర్(జి):** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఫుడ్ పాయిజన్ తో అస్వస్థకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీ హరిరావు గురువారం వైద్యులతో మాట్లాడారు.ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న విద్యార్థులకు పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.అనంతరం అక్కడి నుండి పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు.ఎలాంటి ఆందోళన చెందవద్దని విద్యార్థుల వారి తల్లిదండ్రులకు సూచించారు.

నర్సాపూర్ (జి) మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో అస్వస్థకు గురైన విద్యార్థుల పరిస్థితిని ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్కకు ఫోన్ ద్వారా డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు ఫోన్లో మాట్లాడారు.దగ్గరుండి విద్యార్థులకు చికిత్సలు అందించేలా చూడాలని మంతి సీతక్క శ్రీహరి రావుకు సూచించారు.



## షీ టీంలపై అవగాహన పెంచుకోవాలి




**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** మహిళలు, బాలికల రక్షణ కోసమే షీ టీంలు పనిచేస్తున్నాయని ఆసిఫాబాద్ షీ టీం ఇంచార్జ్ సునీతపేర్కొన్నారు. గురువారం జిల్లా లోని కెరమేరి మండలం కెజిబివి పాఠశాల విద్యార్థినులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లా ఎస్పి సురేష్ కుమార్, అదనపు ఎస్పి (అడ్మిన్) ప్రభాకర్ రావు ఆదేశాల మేరకు షీ టీం అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినులు, మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్‌లకు గురైనట్లయితే వెంటనే షీటీంను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా ఏదైనా అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని, లేదా షీ టీం ఆసిఫాబాద్ 8712670564కు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, యాజమాన్యం, షీ టీం సభ్యులు, శ్రీలత, స్వప్న పాల్గొన్నారు.

## తూకంలో మోసం చేస్తే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/మల్లాపూర్:** నిరుపేద కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం పంపిణీలో తూకంలో మోసాలకు పాల్పడినట్లు దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ వీర్ సింగ్ హెచ్చరించారు. మల్లాపూర్ మండల కేంద్రంలోని 2711032 చౌక ధరల దుకాణం నందు నిత్యవసర సరుకుల పంపిణీలో క్వింటాల్ 10కిలోల తేడా వచ్చినందున సదరు రేషన్ డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. చౌక ధరల దుకాణంలో మోసాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి తీసుకురావాలని వివరాలు గోప్యంగా ఉంచి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ వీర్ సింగ్ తెలిపారు.

## ఇసుక అక్రమ రవాణా చేసే ట్రాక్టర్ల పట్టివేత

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని సాతారం శివారులోని పెద్ద వాగు నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై కిరణ్ గురువారం తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి..

**ప్రజాపక్షం/కొడిమ్యాల:** రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర భాజాపా పార్టీ పిలుపు మేరకు జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు రేకులపల్లి రవీంధర్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంధర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్న రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మండల బిజెపి శాఖ ఆధ్వర్యంలో గురువారం రోజున స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఎన్నికల హామీలు మొదటగా రెండు లక్షల రుణమాఫీ, వరి పంటకు ఐదు వందల రూపాయల బోనస్, రైతు పెట్టుబడి బడి సహాయం అందించాలని హామీలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చ కార్యదర్శి వడ్ల కొండ బుచ్చి రాములు, శ్రీరాములపల్లి గ్రామ మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్ చల్ల శ్రీనివాస్‌రెడ్డి, మండల భాజాపా ప్రధాన కార్యదర్శి కాయిత అంజయ్య, కిసాన్ మోర్చ మండల అధ్యక్షులు బండ నర్సింహా రెడ్డి మరియు నాయకులు పాల్గొన్నారు.



## రుత్వికకు నంది ప్రతిభ పురస్కార్ అవార్డు

**ప్రజాపక్షం/రామకృష్ణాపూర్:** శిఖర ఆర్ట్స్ నిర్వహించిన సాహిత్య రంగంలో ప్రతిభ కనబరిచిన వారికి నంది ప్రతిభా పురస్కార్ 2024 అవార్డులను గురువారం నాడు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో అందజేశారు. రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన ఆకినపల్లి రుత్విక సాహిత్య రంగంలో ప్రతిభను కనబరిచి, వివిధ రంగాల్లో ఆమె అందిస్తున్న








సేవలను గుర్తించి రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో సినీ రచయిత దర్శకుడు కె.వి భారవి చేతుల మీదుగా నంది ప్రతిభ పురస్కార్ అవార్డును పొందింది. ఈ సందర్భంగా ఆకినపల్లి రుత్విక మాట్లాడుతూ ఈ అవార్డు తనకు రావడం సంతోషంగా ఉందని, ముమ్ముందు సాహిత్య రంగంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు అవకాశం కల్పించిన శిఖర ఆర్ట్స్ వారికి, ప్రోగ్రాం డైరెక్టర్ ఉప్పులేటి నరేష్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## వడ్డెర కులస్తులను ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందిస్తాం

**ప్రజాపక్షం/జగిత్యాలరూరల్ :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో అంతర్గాం ఒడ్డెర కాలనీ మాజీ సర్పంచ్ గంగాధర్, ఎల్లయ్య, నర్సయ్య, స్వామి, కాలనీ యువకులతో పాటు గురువారం నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తాటిపర్తి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఒడ్డెర కాలనీలో మౌళిక వసతులు కల్పించి, భవన నిర్మాణ రంగంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న ఒడ్డెర కులస్తులను ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందించడంతో పాటు సంక్షేమ పథకాల అమలులో ప్రాధాన్యత కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. నిర్మాణ రంగంలో వసూలు చేస్తున్న సెస్ కార్మికుల సంక్షేమానికి వెచ్చించాలని అన్నారు. శ్రమకు నిర్వచనమైన ఒడ్డెర కులస్తుల హక్కుల రక్షణకు తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. ఒడ్డెర కాలనీలోని పాఠశాలకు ప్రహరీ నిర్మాణంతో పాటు అదనపు గదులు నిర్మాణం చేపడతామని అన్నారు. అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు, చౌకల ధరల దుకాణం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం నుండి రూపాయి సాయం ఆశించకుండా రామాలయం నిర్మాణానికి విరాళాలు సేకరించుకొని నిర్మాణం చేపట్టడం అభినందనీయమని జీవన్ రెడ్డి అన్నారు. ఒడ్డెర కాలనీలోని సిసిరోడ్డు నిర్మాణం కోసం సియం రేవంత్ రెడ్డి దృష్టి కి తీసుకెళ్లి రూ.లు 20లక్షలు కేటాయించామన్నారు. రామాలయ నిర్మాణానికి సిజిఎఫ్ నిదుల నుండి రూ.ల 50లక్షలు నిదులు మంజూరు చేస్తామని జీవన్ రెడ్డి హామీ ఇచ్చారు. అంతర్గాంలోని ఆంజనేయస్వామి ఆలయానికి రూ.ల 1కోటి నిదులు కేటాయించామని గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా అండగా నిలిచి, ఎంపిగా గెలిపించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడ జున్ను రాజేందర్, మండల కాంగ్రెస్ నాయకులు, అంతర్గాం ఒడ్డెర కాలనీ నాయకులు, యువకులు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

**ప్రజాపక్షం/ఖానాపూర్:** ఖానాపూర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రజల సౌకర్యార్థం త్రాగునీటి కోసం,రెండు చలివేంద్రాలను ఏర్పాటు చేసింది.వీటిని గురువారం మున్సిపల్ చైర్మన్ రాజు రా సత్యం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ,ప్రతి ఏడు లాగే ఈ ఎండాకాలంలో కూడా,ప్రజల సౌకర్యార్థం తాగునీటి చలివేంద్రాలను ఏర్పాటు చేసామని అన్నారు.అ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కావలి సంతోష్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికేని దయానంద్,ప్రధాన కార్యదర్శి షబ్బీర్ భాష, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్,నాయకులు ,తదితరులు ఉన్నారు.



## కారకులైన సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** నర్సాపూర్ మండల కేంద్రంలోని కేజిబివి పాఠశాలలో ఫుడ్ పాయిజన్ తో అస్వస్థతకు గురైన విద్యార్థులను నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఏరియా హాస్పిటల్ లో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పరామర్శించారు. తక్షణమే దీనికి కారకులైన సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఆర్ఎస్ఎస్ భవన నిర్మాణానికి భూమి పూజ



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లా కేంద్రంలోని నటరాజ్ నగర్ కాలనీలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ భవన నిర్మాణానికి హంపి పీఠాధిపతి శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామీజీ,బిజెఎల్పి నేత మహేశ్వర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జి ఈశ్వర్,ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యవాహ రమేష్ లు భూమి పూజ చేశారు.ఆర్ ఎస్ ఎస్ సంఘ భవన కార్యలయ నిర్మాణం భూమి పూజ చేయడం సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు.

## విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** పట్టణంలోని దత్తాత్రేయ నగర్ లో శ్రీ యంత్రోద్ధారక ఆంజనేయస్వామి విగ్రహ శివ పంచాయతన దత్తాత్రేయ పాద వల్ల శ్రీ నృసింహ సరస్వతి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో మాజీ మంత్రి అల్లోల ఇంద్ర కరణ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ పునర్నిర్మానం కొరకు 65 లక్షలు రూపాయలు మంజురు చేసినట్లు వారు తెలిపారు.



## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ప్రతినిధి:** ఆసిఫాబాద్ జిల్లాలోని చింతలమానే పల్లిలోకి ప్రవేశించిన ఒక ఏనుగు ఇప్పటివరకు ఇద్దరి మృతికి కారణమైనట్టుగా జిల్లా ఎస్పి సురేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. చింతలమానపల్లి, పెంచికల్‌పేట్, దహెగాం, బెజ్జుర్ మండల చుట్టుపక్క గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక బృందాల ద్వారా ఏనుగు జాడ కోసం ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు.



# సమ సమాజ స్థాపనకై కృషిచేసిన కృషీవలుడు బాబు జగ్జీవన్ రామ్

ప్రజాపక్షం/సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఎంపీహెచ్ఎస్ పాఠశాలలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాన్ని టిఆర్‌టిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టిఆర్‌టిఎఫ్ జిల్లా అధ్యక్షులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ మాట్లాడారు. డాక్టర్ జగ్జీవన్ రాం పేరొందిన స్వాతంత్ర్య సమర యోధుడని, సంఘ సంస్కర్త, రాజకీయవేత్త, సమ సమాజ స్థాపన కై కృషి చేసిన కృషివలుడని కొనియాడారు. బీహార్లోని వెనుకబడిన వర్గాల నుండి వచ్చిన ఆయన బాబూజీగా ప్రసిద్ధడని అన్నారు. భారత పార్లమెంటులో నలభై ఏళ్ళపాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించడమే కాకుండా ఉప ప్రధానిగా వ్యవహరించాడన్నారు. 1935లో అంటరాని వారికి సమానత్వం కోసం అంకితమైన ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ అనే సంస్థను స్థాపించడంలో అతను కీలక పాత్ర పోషించాడన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మండల అధ్యక్షులు పోతుగంటి రమేష్, ప్రధాన కార్యదర్శి లక్కే లక్ష్మీరాజం, టిఆర్‌టిఎఫ్ జిల్లా కౌన్సిలర్ గాజెంగి విష్ణు, ఉపాధ్యాయులు ఉచ్చిడి పద్మా రెడ్డి, దుమాల శైలజ, ఇప్పలపల్లి శ్రీలత, భ్రమరాంబిక, వైష్ణవి, సుప్రియ, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.




## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి పట్టణంలో గత నెల 28న కునారం రోడ్ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి తీవ్ర గాయాల పాలవడంతో పెద్ద పెల్లి ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి అనంతరం 108 వాహనంలో కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ గురువారం రోజున మృతి చెందినట్లు పెద్దపల్లి ఎస్సై లక్ష్మణ్ రావు తెలిపారు. మృతదేహం కరీంనగర్ సివిల్ ఆస్పత్రిలో భద్రపరిచినట్టు ఆచూకీ కోసం పెద్దపెల్లి పోలీసులను సంప్రదించాలని కోరారు.

## నర్సరీలో మొక్కల సంరక్షణకు చర్యలు



ప్రజాపక్షం/ముధోల్: మండలంలోని తరోడ గ్రామంలో గల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నర్సరీలో మొక్కలు పచ్చదనంతో కలకలాడుతున్నాయి. గ్రామ నర్సరీలో మొక్కల సంరక్షణకు సిబ్బంది ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకున్నారు.ముఖ్యంగా ప్రతిరోజు నీళ్లు పెట్టడంతో పాటు ఎండ నుండి రక్షించడానికి అవసరమైన ఏర్పాటు చేశారు. నర్సరీలో ఆయా రకాల మొక్కలను పెంచుతున్నారు.ప్రస్తుతం ఎండలు విపరీతంగా పెరిగిపోవడంతో అక్కడక్కడ మొక్కలు వాడిపోతున్న నర్సరీలో మాత్రం పచ్చదనం ఉట్టిపడేలా మొక్కలు పెరిగాయి. .మొక్కలకు జీవామృతాన్ని విధిగా వేస్తున్నారు.వన సంరక్షకుడు షేక్ నజీర్ మొక్కల సంరక్షణకు ప్రతేకంగా శ్రద్ధ తీసుకుంటున్నారు.

## ఎస్ ఓ నిర్లక్ష్యం వల్లనే ఫుడ్ పాయిజన్... ఎస్ ఓ ని సస్పెండ్ చేయాలి



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్: నిర్మల్ జిల్లా లోని నర్సాపూర్ మండల కేంద్రంలో ఉన్నటువంటి కేజీబీవీ పాఠశాలలో కలుషిత ఆహారం తిని 26 మంది విద్యార్థులు అవస్థకు గురి అయ్యారు నలుగురు విద్యార్థులు ఐ.సి.యు లో ఉన్నారు.ఈ రోజు విద్యార్థులను ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.గత కొన్ని రోజుల నుంచి విద్యార్థులకు ఉదయం చేసిన వంటలు మధ్యాహ్నం రాత్రి పెట్టడం వల్ల సంఘటన జరిగిందని అన్నారు. ఈ విషయం ఎస్ ఓ కి తెలిసినా కూడా పట్టించుకోలేదు మీ ఇంటి కాడ వేడివేడి అన్న తింటారా పెట్టిందే తినాలి అని అన్నరు అడుగుతే బాగుండదని బెదిరించడం వంటివి సంఘటనలు జరిగాయి. విద్యార్థులకు ఇంకా ఎక్కువ కావడంతో ఎస్ఓ మేడం రాకుండా విద్యార్థులకు సమాచారం ఇచ్చి మీ పిల్లలకి హెల్త్ బాలేదు తీసుకుని వెళ్లి అనడం చాలా విడ్డూరంగా ఉంది అని అనవచ్చు ఇకనైనా ఎస్ఓ మేడం ని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నాం వేటనే డి.ఇ.ఓ స్పందించాలి లేనిపక్షంలో యూఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాలతో డి.ఇ.ఓ కార్యలయని ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నాము.

## క్రీడాకారులకు ఫ్రూట్స్ అందజేత



ప్రజాపక్షం/సుల్తానాబాద్ : పెద్దపల్లి మాజీ శాసనసభ్యులు స్వర్గీయ బిరుదు రాజమల్లు రెండవ నెల సందర్భంగా సుల్తానాబాద్ పట్టణంలోని మిని స్టేడియంలో జరుగుతున్నటువంటి ఖేలో ఇండియా ఖోఖో కోచింగ్ క్యాంప్ లో పాల్గొని క్రీడాకారులకు సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ముత్యాల రవీందర్ ఆధ్వర్యంలో అరటి పళ్ళు, బిస్కెట్ పాకెట్స్ , వాటర్ బాటిల్స్ ను గురువారం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలో బిరుదు రాజమల్లు క్రీడారంగానికి చేసినటువంటి సేవలను కొనియాడారు, ఆయన యొక్క స్ఫూర్తితోనే సుల్తానాబాద్ పట్టణంలో ఎంతోమంది క్రీడాకారులుగా ఎదిగి వ్యాయామ ఉపాధ్యాయులుగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉపాధ్యాయులుగా పని చేస్తూ పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నారని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు, ఈ కార్యక్రమంలో సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ అంతటి శంకరయ్య , అంతర్జాతీయ క్రీడాకారులు గెల్లు మధుకర్ , సీనియర్ క్రీడాకారులు అమిరిశెట్టి తిరుపతి, దొడ్ల దేవేందర్ పటేల్ , ,బోల్లిశెట్టి చిట్టి తదితరులు పాల్గొన్నారు.

## వన్యప్రాణులను సంరక్షించాలి



ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి : జిల్లాలో వన్యప్రాణుల సంరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర పమేలా సత్పతి సూచించారు. వాటి ఆవాసాలు ధ్వంసం కాకుండా చూడాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కరీంనగర్ కలెకటరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. వన్యప్రాణుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అడవులను రక్షించుకోవడంతో పాటు మన్యప్రాణులను కాపాడుకోవాలని పేర్కొన్నారు. వేసవి కాలం నేపథ్యంలో వాటికి తాగునీటిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. హరిత హారం కార్యక్రమంలో నాటిన మొక్కలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. వాటి రక్షణకు ఎప్పటికప్పుడు నీటిని అందించాలని తెలిపారు. అటవీశాఖ అధికారులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఎఫ్‌వో బాలామణి, మైనింగ్ శాఖ ఏడీ రామాచారి, కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు కె.మహేశ్వర్, రమేష్ బాబు, సిసిఎస్ ఏసిపి కాశయ్య, అటవీశాఖ రేంజ్ ఆఫీసర్లు రెడ్డి రాజేందర్ రావు, ఏటిడివో దివాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## త్రాగు నీటికి ఇబ్బందులు లేకుండా సరఫరా చేయాలి



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి: జిల్లాలో వేసవి కాలంలో త్రాగు నీరు ఇబ్బందులు రాకుండా అధికారులు సమన్వయం తో పని చేస్తూ త్రాగు నీటి సరఫరా చేయాలని ఉమ్మడి కరీంనగర్ ప్రత్యేక అధికారి, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు ఆర్వీ కర్ణన్ అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అదనపు కలెక్టర్లు పి.గౌతమి, ఖీమ్యా నాయక్ లతో కలిసి వేసవికాలంలో తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ, మండల, మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ వేసవికాలంలో తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో మంచి వ్యవస్థను, కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. సంక్షోభ సమయంలోనే మన పని తీరు పరీక్షకు గురవుతుందని, మిషన్ భగీరథ అధికారులు మండల పరిషత్ జిల్లా పరిషత్ పంచాయతీ అధికారులు సమన్వయంతో పని చేసి త్రాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు.జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో ప్రతి ఇంటికి సమృద్ధిగా త్రాగునీరు సరఫరా చేసేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేశామని అన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ కింద గ్రామీణ ప్రాంతాల్లో, వేములవాడ, సిరిసిల్ల మున్సిపాలిటీలలో ఉన్న బోర్ బావులు, పంపులు, స్థానిక నీటి వందులను గుర్తించి వాటికి అవసరమైన మరమ్మత్తు పనులు పూర్తి చేసామని తెలిపారు. ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద సిరిసిల్ల జిల్లాలో త్రాగునీటి సరఫరా సజావుగా నిర్వహించేందుకు గాను 136 పనులకు రెండు కోట్ల 49 లక్షల రూపాయలు మంజూరు చేసి ఇప్పటివరకు 60 పనులు పూర్తి చేశామని, మిగిలిన 75 పనులు వేగవంతంగా జరుగుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. త్రాగునీటి సరఫరాను పర్యవేక్షించేందుకు కలెక్టరేట్ లో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, త్రాగునీటి సరఫరా పై ఫిర్యాదులు ఉంటే 9398684240 ఫోన్ నెంబర్ కు తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం అగ్రహారం లోని మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్స్, వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్ సందర్శించి మోటర్ల పని తీరు ను పరిశీలించారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు పి.గౌతమి, ఎన్.ఖీమ్యా నాయక్, జిల్లా పరిషత్ సీఈవో ఉమారాణి, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, మిషన్ భగీరథ ఈఈ లు జానకి, విజయ్, భూగర్భజల శాఖ అధికారి నర్సింహులు, పబ్లిక్ హెల్త్ కార్యలు ఈఈ సంపత్, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి అన్సారీ, ఎంపీడీవోలు, ఎంపీఓలు, తదితరులు పాల్గొన్నారు.

## దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు



ప్రజాపక్షం/లోకేశ్వరం: మండలంలోని డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఏవో గణేష్ ఏఈఓ భూమేష రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో గణేష్ మాట్లాడుతూ రైతులు డీసీఎంఎస్ సెంటర్లోకి వరి ధాన్యము తీసుకురావాలని రైతులు దళారులను నమ్మి పోవద్దని ప్రభుత్వం వరి ధాన్యము ఏ గ్రేడ్ ధాన్యానికి 2203 బి గ్రేట్ ధాన్యానికి 2183 ధర కల్పించడం జరుగుతుందని సెంటర్ నిర్వాహకులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగాకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భోజారం పటేల్, ఎల్లన్న, రమణారెడ్డి,రాజేందర్ రెడ్డి శ్రీనివాస ఆశోక్ రాజేశ్వర్ రైతులు పాల్గొన్నారు.

## పీచర పాఠశాలకు 50వేల రూపాయల విరాళం అందజేత

ప్రజాపక్షం/లక్ష్మణచందా: మండలంలోని పీచర గ్రామానికి చెందిన మచ్చేందర్ రెడ్డి, హైదరాబాదులో స్థిరపడడం జరిగింది.తన గ్రామానికి తన వంతుగా కృషి చేయాలని ఆలోచనతో జడ్పీహెచ్ఎస్, ఎంపీపీ ఎస్ పాఠశాలలకు లైబ్రరీకి సంబంధించిన పుస్తకాలు,విద్యార్థులకు కావలసిన వస్తువులను అందించడం జరిగింది.మచ్చేందర్ రెడ్డి తన చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం జరిగింది అంతేకాకుండా తన చిన్న నాటి మిత్రులందరిని సన్మానించడం జరిగింది మచ్చేందర్ రెడ్డిని పాఠశాల సిబ్బంది ఘనంగా సత్కరించడం జరిగింది విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మార్వో జానకి పాల్గొన్నారు.ప్రధానోపాధ్యాయులు సాయి కృష్ణ, విద్యా రాణి,పాఠశాల సిబ్బంది విశ్రాంత అధికారులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్: ఎండాకాలం నేపథ్యంలో త్రాగు నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి,జిల్లా ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్,అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ లతో కలిసి ఆయన జిల్లాలో త్రాగునీటి సమస్యలు,పరిష్కార అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ, జిల్లాలోని గ్రామీణ,పట్టణ ప్రాంతాల ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలోని 3 మున్సిపాలిటీలు,396 గ్రామ పంచాయితీలలో తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశంచారు.మండల ప్రతేక అధికారులు ప్రతి గ్రామాన్నిప సందర్శించాలని,క్షేత్ర పరిశీలనలో నీటి కొరవత ఇబ్బందులు ఏర్పడితే వెంటనే తగు చర్యలు చేపట్టాలన్నారు.సమయస్ఫూర్తక గ్రామాలను గుర్తించి,సమీప బోరు బావుల ద్వారా నీరందించాలని అన్నారు.మిషన్ భగీరథ పైప్ లైన్, ఇతరత్రా సమస్యలుంటే వెంటనే మరమ్మత్తులు చేయించి నీటిని సరఫరా చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్,ఎం.పిడిఓలు,ఎంపిఓలు తదితరులు పాల్గొన్నారు.